# శాంతి

# SANTI

విశ్వమానవ సౌభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

డిసెంబరు/December - 2021

ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయో భవేత్

ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.

– ఋగ్వేద సంహిత

# శాంతి

# SANTI

**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

సంపుటి / Vol. 97 | డిసెంబరు/December - 2021 | సంచిక/No.12


| వ.నెం. | విషయ సూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన – గోపాలతాపన్యుపనిషత్తు | 2 |
| 2. | క్రీస్తు – స్వామి ఓంకార్ | 2 |
| 3. | ధ్యానము – ఆత్మ విద్యా విలాసము | 3 |
| 4. | ఓంకార్ ఆత్మకథ – అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి | 4 |
| 5. | గీతా జయంతి సందేశము : జ్ఞానేశ్వరి మాతాజీ | 8 |
| 6. | భగవత్ కృప – శ్రీ అఖండానంద సరస్వతీ మహరాజ్ | 10 |
| 7. | తత్త్వమసి – శ్రీ తెన్నేటి విశ్వనాథం | 12 |
| 8. | శ్రీతులసీ సర్వస్వము – జి.వి.యస్. సుబ్రహ్మణ్యం | 16 |
| 9. | బుసకొట్టుకాని కాటెయ్యకు – శ్రీ రామకృష్ణ పరమహంస | 18 |
| 10. | దివ్య భావన – స్వామి రామదాసు | 20 |
| 11. | గుణపాఠం | 21 |
| 12. | విజ్ఞప్తి – గో సంతతికై గోశాల విస్తరణ | 23 |
| 13. | దాతలకు విజ్ఞప్తి | 24 |
| 14. | కార్యక్రమములు, విరాళములు | 25–28 |


*** ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులు కాని. సంపాదకులు కారు.**

**జీవిత సభ్యత్వం రూ. 1000/–లు సాలుసరి రూ.100/–**

# ప్రార్థన

గోపాలతాపన్యుపనిషత్తు

## ప్రార్థన ద్వారా మనలో దైవీ గుణములు కల్గుతాయి

ప్రసీద పరమానన్ద ప్రసీద పరమేశ్వర ।
ఆధివ్యాధిభుజఙ్గేన దష్టం మాముద్ధర ప్రభో ॥

**పరమానంద స్వరూపా! అనుగ్రహింపుము. పరమేశ్వరా! ప్రసన్నుడవు కమ్ము. ప్రభూ! మనోవ్యథా – దేహబాధారూప విష సర్పదష్టుడనయిన నన్ను ఉద్ధరింపుము.**

శ్రీ కృష్ణ రుక్మిణీకాన్త గోపీజనమనోహర ।
సంసారసాగరే మగ్నం మాముద్ధర జగద్గురో ॥

**శ్రీకృష్ణా! రుక్మిణీవల్లభా! గోపికామనోహరా! జగద్గురూ! జనన మరణమయ సంసార సాగరమునందు మునిగిన నన్ను ఉద్ధరింపుము.**

కేశవ క్లేశహరణ నారాయణ జనార్దన ।
గోవిన్ద పరమానన్ద మాం సముద్ధర మాధవ ॥

**కేశవా! క్లేశనాశకా! నారాయణా! జనార్దనా! (సహాయమును అర్థించు జనులను రక్షించువాడా!) గోవిందా! పరమానందా! లక్ష్మీనాథా! నాకు దారి జూపి నన్ను రక్షింపుము.**

# క్రీస్తు

స్వామి ఓంకార్

అదిగో! ఒక గొప్ప జీవనాధారము. అందుండియే ప్రకాశమై ప్రేమ, తేజస్సు, జీవితములను ప్రవాహములు ఝల్లున ప్రవహించుచున్నవి.

మనమందరమును మనస్సాక్షిగా యిప్పుడే ఆ అమృత ప్రవాహమున స్నాన మాడుదము గాక!

భగవంతునియొక్క ప్రేమవాహినియందే పవిత్రమైనశక్తిని మన మందరమును పొందుదుముగాక!

అతని దివ్యప్రేమయే మనలను చక్కని బిడ్డలనుగా చేయుచున్నది.

అతని ప్రకాశమానమైన నూతన జీవమే మన జీవితమందలి రక్తనాళమునందును కదలుచున్నది.

ఆ మహామహుని నుండి బహిర్గతమై ప్రవహించెడి జ్ఞానతేజమే మనలను అజ్ఞానము, ద్వైతము అను తప్పుదారుల పడనీయక సదా కాపాడుచున్నది.

ఆ భగవంతుని అనుగ్రహము చేతను, అతని ప్రేమ చేతను అతని పూర్ణ ప్రతి స్వరూపులమై మనమందరమును పూర్ణత్వము నొందిన వారలమే ఎప్పుడో గాదు ఇప్పుడే. అదియే అతని మహిమ.

ఓం ఓం ఓం

(శాంతి డిసెంబరు 1985)

# ధ్యానము

**శ్రీఆత్మవిద్యావిలాసము**

## ధ్యానము ద్వారా మానసిక ఒత్తిడి తగ్గుతుంది.

శ్లో॥ ఏకోఽప్యనేక ఇవ భాతి శరీర భేదాత్
ఆత్మా ఘటాది గత భేదవశా ద్వియద్వత్ ।
దేహేంద్రియాదిషు చలత్సు నిజప్రకాశాత్
పూర్ణోఽపి నిశ్చలతరోఽపి వికారవద్వత్ ॥

కుండలు మొదలైన వాటిలో భేదాలనుబట్టి ఏకమైన ఆకాశం భిన్నంగా కనిపించినట్లు ఏకమైన ఆత్మ శరీరభేదాలనిబట్టి అనేకంగా కనబడుతుంది. తాను పూర్ణము, నిశ్చలము అయివుండి కదులుతుంటే దేహేంద్రియాలలో ప్రతిఫలించే చైతన్యపు కదలిక వల్ల వికారాలు చెందుతున్నట్లు కనబడుతుంది.

ఏకమైన పరమాత్మకి జీవుళ్ళుగా అనేక రూపాలుగా మార్పులు లేని ఆయన మార్పులకు లోనైన జీవుళ్ళుగా ఎలా వ్యక్తమౌతాడనే అనుమానాన్ని ఈ శ్లోకం నివృత్తి చేస్తుంది. పరమాత్మ ఎప్పుడూ ఏకమే, నిజంగా అనేకంగా మారదు. వికారాలకి లోనుకాదు.

ఆకాశం ఎప్పుడూ ఒకటే. వేరు వేరు ఇళ్ళు, గాదెలు, ఫ్యాక్టరీలు, కుండలు, పిడతలు, నిర్మాణమైనప్పుడు అన్నింటిలోను వేరు వేరు స్థలాలుగా కనబడుతుంది. అవి ఉన్నంతకాలమే ఆకాశం వేరు వేరు కొలతలతో, వేరుగా విభజితమైనట్లు కనబడుతుంది. వాటిని తొలగించినప్పుడు ఆకాశం యథాప్రకారంగా ఏకంగా కనబడుతుంది. అలాగే వేరు వేరు శరీరాలలో కనబడే ఆత్మకూడా. అనేకత, చూచే వాళ్ళ దృష్టిలో ఉన్నది కాని నిజంగా లేదు.

పుట్టినప్పటి నుండి పోయేంతవరకు జీవుళ్ళలో కనబడే మార్పులు కూడా దేహేంద్రియాల కదలికలకు, వాటిలోని మార్పులే, పరమాత్మవి కావు. మారిపోతూ కదులుతూ ఉండే వాటిలో పరమాత్మ చైతన్యం ప్రతిబింబించినప్పుడు వాటి కదలికను బట్టి చైతన్యం కదలినట్లనిపిస్తుంది. చైతన్యం నిజంగా కదలదు. ప్రవహించే నీటిమీద సూర్యకాంతి ప్రతిబింబించినప్పుడు, కాంతి ప్రవహిస్తున్నట్లనిపిస్తుంది. కాంతి ప్రవాహం చూచేవాళ్ళ దృష్టిలో వున్నది. నిజంగా లేదు

**అధ్యాయం - 33** **అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి**

## ప్రకృతి ఆరాధనే దైవారాధన

'శాంతా సుసన్నా పర్వతాలు' అనే ప్రదేశం చాలా అందమయిన లోయ ప్రాంతము. చుట్టూ కొండలతో చూడ ముచ్చటగా ఉంటుంది. హాలీవుడ్ నుండి నలభై మైళ్ళ దూరంలో ఉంది. ఎక్కడ భారతదేశంలోని తోటపల్లి కొండల్లోని శాంతి ఆశ్రమము? ఎక్కడ యు.ఎస్.ఎ.లోని కాలిఫోర్నియాలోని శాంతి సుసన్నా పర్వతాలు? చాలా ఆశ్చర్యకరంగా అవి రెండూ నా ఆధ్యాత్మిక జీవితంలో గొప్ప పాత్ర పోషించాయి. మౌనంగా జీవితం గడపాలి అని భావించేవారు. ఒంటరి ప్రదేశాలను ఎంచుకుంటారు. నేను ఎప్పుడు చూచినా హాలివుడ్‌లోనూ, అలాగే లాస్ ఏంజెల్స్‌లోనూ శాంతి కేంద్రాలకి వచ్చే సాధకులకు సాయం చేయడానికి ప్రయత్నిస్తూ బాగా అలసిపోతున్నాని, ప్రశాంతంగా మౌనంగా ధ్యానంలో భగవదనుభూతిని పొందడానికి తహతహలాడుతున్నాని జగదంబ భావించింది.

ఒక మంచి సమయంలో ఆమె తనకు అందమయిన శాంతా సుసన్నా పర్వతాల దగ్గరున్న లోయ ప్రాంతంలో ఒక చిన్న కుటీరం ఉందని, అది చూచి నాకు బాగా నచ్చితే అక్కడే ఉండి కొన్ని రోజులు ప్రశాంతంగా ధ్యానంలో కాలం గడపవచ్చునని చెప్పి నన్ను కారులో అక్కడికి తీసుకువెళ్ళి చూపించింది. ఆమె నాతో అక్కడ పట్టణంలో మాదిరిగా సౌకర్యాలు ఉండవని, కమోడ్, ఫ్లష్, షవర్, ఫ్రిజ్ వంటివి ఉండవని కూడా చెప్పింది. అక్కడ నేను నా జీవితంలో ఎంతో ఆనందకరమయిన కొన్ని రోజులు మౌనంగా ధ్యానంలో గడిపాను. అక్కడ ఆహారం తేలికగా దొరకదు. అందువలన నేను ఎక్కువగా అపక్వాహారం, పళ్ళు, కూరగాయలు మొదలైనవి, జగదంబ తెచ్చిన వాటితోనే సరిపెట్టుకునేవాడిని.

నా తుంటి ఎముక విరగటం వలన నేను నేల మీద కూర్చోలేను, అలాగే నా కాళ్ళు వంగేవి కావు. ఉదయపు వేళల్లో కాలకృత్యాలు తీర్చుకోవడానికి నాకు బాగా ఎత్తులో ఉన్న కమోడ్ అవసరమయ్యేది. అన్ని సౌకర్యాలు ఉన్న ఆధునిక గృహంలోనే నాకు ఎవరో ఒకరి సహాయం కావాల్సి వచ్చేది. ఇంక ఈ చిన్న కుటీరంలో పరిస్థితి గురించి చెప్పవలసిన పనిలేదు. జగదంబ ఒక కమోడ్ నా కోసం గదిలో ఒక మూల ఏర్పాటు చేసింది. నేను చేతి కర్రల సాయంతో నడిచేవాడిని. కుటీరము చుట్టుప్రక్కల చాలా అందమైన ప్రకృతిని చూడడానికి ఆ కర్రల సాయంతోనే నడిచి వెళ్ళేవాడిని. జగదంబ నా కోసం ప్రతి రోజూ ఏవో కొన్ని ఆహార పదార్థాలు తీసుకొని వచ్చేది. అలాగే నేను వాడిన కమోడ్‌ని శుభ్రం చేసేది. వాసన రాకుండా ఉండేందుకు

గాఢమైన డిస్ఇన్ఫెక్షన్ వేసేది. అసలు ఎవరయినా ఇలాంటి పనులు చేస్తారా? ఆవిడ తల్లి కంటే ప్రేమగా నాకు అన్ని సేవలు చేసింది. రూడ్యార్డ్ కిప్లింగ్ ఒకసారి అంటాడు. 'తూర్పు పడమరలు కలవవు' అని కాని నిస్వార్థ సేవలు అందించిన జగదంబ తల్లి తూర్పు పడమరలను కలిపింది కదా! ప్రేమ ఉన్న చోట పనిలో ఉచ్ఛనీచాలు చూడరు. గాంధీ మహాత్ముడే మనందరికి గొప్ప ఉదాహరణగా ఆయన జీవితాన్ని జీవించి చూపించారు. ఆయన సేవలో భాగంగా పాయిఖానాలు కూడా శుభ్రం చేశారు కదా!

హాలీవుడ్ నుండి శాంతా సుసన్నా పర్వతాలు దూరం అవటం వలన నన్ను చూడడానికి నా అదృష్టం కొద్దీ ఎవరూ వచ్చేవారు కాదు. చాలా కొద్ది మంది, ముఖ్యమైన వాళ్ళు మాత్రమే వచ్చేవారు. అందువల్ల నేను మౌనంగా నా సాధనలో, ధ్యానంలో రాత్రి పగలు మునిగిపోయేవాడిని. భగవంతుని అనుగ్రహం వలన నిరంతరము దైవ చింతనలో కాలం గడిపేవాడిని. అక్కడ ఉన్న సమయాన్నంతా చక్కగా సద్వినియోగం చేసుకుంటూ నిరంతరాయంగా ధ్యానంలో, ప్రార్థనలో ఆనందంగా, హాయిగా ఉండేవాడిని. అక్కడ ప్రశాంతంగా కాలం గడిపినప్పుడు నా హృదయపు లోతుల్లోని కొన్ని సందేశాలు వచ్చినవి వ్రాసాను. ఎంతో ఉత్తేజపూరితమైన విశ్వశాంతి ప్రార్థనకి పవిత్రమైన హిమాలయాల్లో బీజం పడితే అది శాంతాసుసన్నా పర్వతాల్లో పూర్తి రూపాన్ని దిద్దుకుంది. అది ఇప్పుడు కొన్ని వేల మంది భక్తుల హృదయాలలో ఎంతో ఉత్తేజాన్ని, ఆధ్యాత్మిక శక్తిని, దైవిక బలాన్ని ఇస్తోంది. భగవంతుని బిడ్డలయిన ప్రపంచంలోని, తూర్పు పడమర దేశాల్లోని భక్తులందరి హృదయాలను శాంతితో ప్రేరేపిస్తోంది. మతంతో సంబంధం లేకుండా విశ్వశాంతి ప్రార్థన ప్రపంచ వ్యాప్తంగా అన్ని భాషల్లోకి అనువదించబడి ముద్రించబడింది.

ఒక రోజు జగదంబ వార్తాపత్రికలతో ఎంతో ఉత్సాహంగా వచ్చి, లాస్ ఏంజెల్స్ హెరాల్డ్ – వార్తా పత్రికలో పిఠాపురం మహరాజు ఛాయాచిత్రం వేశారని చూపించింది.

పిఠాపురంలోనే నేను జన్మించాను. ఆ రోజుల్లో మహారాజా అంటే చాలా గొప్ప. వారిని సమీపించడానికి కూడా ఎవరికి అవకాశం ఉండేది కాదు. పిఠాపురం మహారాజా వారి పట్టాభిషేక మహోత్సవం జరిగినప్పుడు నాకు సమారుగా పది సంవత్సరాలు లేదా ఇంకా తక్కువ వయస్సు ఉంటుంది. నాకు ఒక విషయం బాగా గుర్తుంది. ఊరంతా సంబరాలు జరిగాయి. ఎక్కడ చూచినా తోరణాలతో, జెండాలతో, పూలతో కూడిన ఆర్చీలతో ఊరంతా బాగా అలంకరించారు. సంగీత వాయిద్యాలతో ఊరంతా పెద్ద ఊరేగింపు జరిగింది. మహారాజా వారి భవంతి చుట్టూ చాలా పెద్ద మట్టి దిబ్బ ఉండేది. దాని వలన భవంతి లోపల కనబడకుండా అది అడ్డుగా ఉండేది. మహారాజా వారి భవనం లోపల జరుగుతున్న వేడుకలు బయటివారికి కనబడకుండా ఆ దిబ్బ

పెద్ద గోడలాగా అడ్డుగా ఉంది. మేము చిన్న పిల్లలము కావడం వలన భవనం గేటు వద్దకు కూడా పోనివ్వలేదు. నాకు ఇంకా బాగా గుర్తుంది. నేను నా తోటి స్నేహితులతో కలిసి ఆ మట్టి దిబ్బపైకి ఎక్కి కూర్చుని అక్కడ జరుగుతున్న వేడుకలను చూసి ఆనందించాము. భవనం లోపల సంగీత కచేరీలు, నాట్యాలు, ఇంకా రకరకాల వేడుకలు, సంబరాలు జరుగుతున్నాయి. ఆ ఎండలోనే మేము అవన్నీ చూచాము.

కాలంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయి. మహారాజులు బిక్షగాళ్ళుగా మారవచ్చు. అలాగే బిక్షగాళ్ళు మహారాజులు కావచ్చు. మహాధనవంతులు కావచ్చు. ఆ రోజు నేను చిన్న పిల్లవాడిని, మహారాజావారి పట్టాభిషేక మహోత్సవాన్ని చూడడానికి భవంతికి గాని, లోపల ప్రదేశంలోనికి గాని వెళ్ళలేకపోయాను. మట్టి దిబ్బ లాంటి గోడ మీద ఎక్కి చూసాను. కానీ నేడు కాలిఫోర్నియా, హాలివుడ్ వచ్చాను. అమెరికాలోని భక్తుల కోసం లాస్ ఏంజెల్స్‌లోనూ, హాలివుడ్‌లోనూ ఆధ్యాత్మిక సేవలు అందించడానికి శాంతి కేంద్రాలను స్థాపించి, శాంతాసుసన్నా పర్వతాల్లో ధ్యానం చేసుకుంటున్నాను. ఇప్పుడు ఆ పిఠాపురం మహారాజా వారు మహారాణి వారితో ఆయన కుటుంబ సభ్యులందరితో కలిసి విదేశీయాత్రకు హాలీవుడ్ వచ్చారు.

మానవుని జీవితంలో జరగబోయే సంఘటనలను ముందుగా ఊహించటం ఎవ్వరికి సాధ్యం కాదు. జరిగే మార్పులను నిజంగా తెలుసుకోవడం కష్టం. దాదాపు అరవై సంవత్సరాలు జరిగిపోయాయి. ఇప్పుడు కూడా ఆనాటి నా బాల్యంలోని సంఘటన గుర్తు వస్తోంది. మహారాజా వారి పట్టాభిషేక మహోత్సవాన్ని గోడ ఎక్కి చూడడం. కానీ ఇప్పుడు నేను చాలా వింతగా నన్ను నేను ఒక సాధు మహాత్మునిగా, జపధ్యానాదుల్లో మౌనంగా జగదంబ కుటీరంలో శాంతాసుసన్నా పర్వత ప్రదేశంలో గడుపుతూ గమనిస్తున్నాను.

పిఠాపురం మహారాజు, మహారాణి, వారి కుటుంబ సభ్యులను చూడాలని జగదంబ చాలా కుతూహల పడటం గమనించి నేను రాజా వారికి హాలివుడ్‌లోని మా శాంతి కేంద్రాన్ని దర్శించమని ఉత్తరం వ్రాశాను. అప్పుడు వారి హాలివుడ్‌కి చాలా దూరంలో ఉన్నారు. అలాగే పిఠాపురంలోని రాజమందిరానికి కూడా దూరంగానే ఉన్నారు. ఆయన నా ఆహ్వానాన్ని మన్నించి రావటానికి ఒప్పుకున్నారు. ఒక రోజు సాయంత్రం వేళ రాజా వారు తన కుటుంబ సభ్యులందరితో కలిసి హాలివుడ్‌లోని మా శాంతి కేంద్రాన్ని దర్శించారు. మేము ఆర్భాటం లేకుండా ప్రశాంతంగా చేస్తున్న ధార్మిక ప్రచారాన్ని గమనించి చాలా సంతోషించారు. జగదంబ మహారాజా వారి కుటుంబాన్ని తన ఇంటికి భోజనానికి ఆహ్వానించింది. వాళ్ళు మొత్తం ఇరువై మంది వచ్చారు. విందు చాలా బాగా జరిగింది. జగదంబ చేసిన రుచికరమైన వంటలను వారు ఎంతో మెచ్చుకుంటూ భోజనం చేశారు. ఆమె వారి కోసం భారతీయ వంటకాలను

కూడా సిద్ధం చేసింది. కూరలు, అప్పడాలు, వడియాలు మొదలైనవి తిని మహారాజా వారు ఆయనతో వచ్చిన వారందరూ సంతోషించారు. అమెరికాలో భారతదేశపు వంటకాలు రుచి చూసి చాలా రోజులయిందని చెప్పారు.

తర్వాత ఆధ్యాత్మిక సమావేశంలో కొన్ని సందేశాలు చదివి వినిపించిన అనంతరము అందరితో ధ్యానము చేయించాను. ఆ రోజు సాయంత్రం జగదంబ కార్లలో స్నేహితులను కూడా వెంటబెట్టుకొని హాలివుడ్‌లో జరిగే కార్యక్రమానికి తీసుకువెళ్ళింది. అక్కడ సంగీత కార్యక్రమం జరుగుతోంది. వేలమంది దానిని చూడడానికి వచ్చారు. చాలా ప్రసిద్ధి చెందిన కళాకారులు వివిధ రకాలయిన వాయిద్యాలపై సంగీతాన్ని వినిపిస్తున్నారు. జగదంబ తెలిసినవారి ద్వారా ప్రత్యేకమయిన టికెట్లు తెచ్చింది. అందువలన మేమందరము స్టేజికి దగ్గరగా ముందు వరుసలో కూర్చోగలిగాము. ఆ రాత్రి నా జీవితంలో మర్చిపోలేని మధురానుభూతి కలిగింది.

శాంతి ఆశ్రమానికి మంచి భవిష్యత్తు ఉండడం వలన తర్వాతి కాలంలో మహారాజు గారి అబ్బాయి సూర్యారావు గారు యువరాజు ఆశ్రమ సేవల్లో పాలుపంచుకున్నారు. ఆదర్శవంతమయిన భక్తునిగా మారాడు. ఆయన చాలా శ్రద్ధతో, ఇష్టంగా శాంతి ప్రచారంలో పాల్గొనేవారు. మూడు సంవత్సరాలు శాంతి ఆశ్రమానికి వారే ప్రెసిడెంటుగా ఉండి ఆశ్రమ కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేలా శ్రద్ధ వహించారు. శాంతి సందేశాలను విస్తృతంగా ప్రచారం చేయడానికి తోడ్పడ్డాడు. ఆశ్రమం చుట్టు ప్రక్కల మాత్రమే కాకుండా దూర ప్రాంతాల్లో కూడా ఆధ్యాత్మిక ప్రచారానికి పాటుపడ్డారు.

మహారాణి గారు సాధ్వీమణి మంచి భక్తిపరురాలు. ఆవిడ ఆశ్రమంలోని స్త్రీలకు, చిన్న పిల్లలకి ఎన్నో సేవలందించేవారు. ఆమెకు సోదరి సుశీలాదేవి అంటే ఎంతో ప్రేమ ఉండేది. ఆవిడ ఎక్కువ సమయము భగవంతుని పూజాదికాలు చేయటంలో గడిపేది. ప్రమిదలు, అగరుబత్తులు వెలిగించేది. అనుకోకుండా ఒక రోజు చాలా విషాదకరమైన సంఘటన జరిగింది. ఆమె పూజ చేసేటప్పుడు చాలా దీపాలు వెలిగించేది. ఆ రోజు ఆమె చీరకు నిప్పు అంటుకొని ఒళ్ళంతా కాలిపోయి చనిపోయింది. అది విన్నవారంతా నిర్ఘాంతపోయారు. అంతటి సాధ్వీమణి, భక్తిపరాయణురాలు ఎప్పుడూ భగవచ్ఛింతనలోనే కాలం గడిపే భక్తురాలు భగవంతుని ఆరాధిస్తూనే ప్రాణాలు వదిలింది. కర్మ నుండి ఎంతటి వారయినా తప్పించుకోవటం అసాధ్యం కదా! చిన్నమాంబ రాణి గారి ఆత్మకు శాంతి కల్గుగాక! భగవంతుని సన్నిధిలో శాంతిగా ఉండుగాక! శాంతి ఆశ్రమ సభ్యులు, భక్తులు, ఆమె స్నేహితులు, బంధువులు ఆమెను ఆరాధించే వారందరూ ఆమె ఆత్మ శాంతి కోసం ప్రార్థనలు చేశారు.

# గీతాజయంతి సందేశము

పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ

## శ్రీకృష్ణునికి నమస్కరించిన వానికి పునర్జన్మ ఉండదు

ఈ పవిత్ర భారతదేశములో మనము ముఖ్యముగా జ్ఞాపకముంచుకొని జరుపుకొనవలసిన జయంతులలో శ్రీకృష్ణ జయంతి, గీతాజయంతి. శ్రీ శంకర జయంతి మొదలగునవి.

భగవంతుడు మన భారతదేశములో దుష్టజన శిక్షణ, శిష్టజన రక్షణార్ధం దశావతారములెత్తెను. అందులో ముఖ్యమైన అవతారము శ్రీకృష్ణావతారములో చేయబడిన కార్యము చాలా గొప్పది. ప్రపంచమున కంతకు శాశ్వతముగా ఉపయోగపడుచున్నది.

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా

ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః – భగీ 4–34

పై శ్లోకములో చెప్పబడినట్లు తత్త్వదర్శనుని సమీపించి, భక్తి వినయములతో ప్రశ్నించి తెలిసికొనవలసి యుండును. ఒక పర్యాయము సరిగా బోధింపబడిన మానవులు తిరిగి యెన్నటికిని మోహములో పడరు. తిరిగి జన్మించనవసరముండదు. ఈ ప్రపంచములో మానవులందరికి, వారి వారి క్లిష్ట సమస్యల నన్నిటిని గీత తప్పక పరిష్కరించగలదు. అది తీర్చలేని సమస్యే యుండదని రూఢిగా చెప్పవచ్చును.

గీత కర్మసిద్ధాంతమును చాలా స్పష్టముగా చెప్పగల్గినది. ఎవరు ఏ విత్తనమువేస్తే దాని ఫలితమునే తప్పక అనుభవించెదరు. గాన శ్రీ స్వామీజీ తరుచు జ్ఞాపకము చేయుచున్న ధర్మచట్టమేమనగా, వెనుకటి జన్మలలో చేసిన కర్మముల ఫలితము యిప్పుడు అనుభవించక తప్పుటలేదు. ఎంతో గొప్ప సత్కర్మ చేసినగాని దుష్కర్మ ఫలితము తగ్గించుకొనుటకైనను అవకాశ ముండదు. గాన ఇప్పుడు మనము చేయు కర్మను జాగ్రత్తగా, ధర్మయుతముగా చేసికొన గలిగిన, ముందు జన్మలలోనైనను, సుఖమనుభవించుటకు అవకాశముండును. గాన మనము ఈ జన్మలో సదా దైవజ్ఞప్తితో సత్కర్మనే ఆచరించుట చాలా ముఖ్యము.

భగవద్గీతలో చనిపోయిన ప్రతివారు, వారు చేసిన కర్మల ప్రకారం జంతు జన్మలేగాక క్రిమి కీటకాది జన్మలు గూడ, చేసినపాపములకు ఫలితముగా ఎత్తక తప్పదని చెప్పబడెను. గాన ప్రతి భారతీయుడును తప్పక గీతాసారమును గ్రహించి తీరాలి. అమెరికా, జర్మని, రష్యా, వగైరా దేశములలో కూడా గీతను ఎంతో భక్తితో పఠించి

దాని సారమును గ్రహించుచుండ మన దేశములో గీత చదువని వారు ముఖ్యముగా హిందువులు ఉండరాదు. అంతా రామమయం ఈ జగమంతా కృష్ణమయం అని ఆశ్రమములో సదా పాడించుచుందురు. దాని భావం అందరిలో శ్రీరామచంద్రుని, శ్రీకృష్ణుని చూచి ప్రేమించవలసినదనియే గదా. ప్రతి మానవుడు సదా ఆనందముగా నుండుటనే స్వామీజీ కోరుచుందురు. దానికి పూజ్యశ్రీ స్వామీజీ చూపించుచున్న సులభ మార్గమును ఆచరణలో పెట్టుకొన లేకున్నారు. వారు చెప్పినట్లు అందరిలో శ్రీరాముని, శ్రీకృష్ణుని రూపమును చూచుచు ప్రేమించుటను సాధనచేయుట ముఖ్య కర్తవ్యము. పరమాత్మ తనకు నిజమైన భక్తులెవరో గీత అ.12 శ్లో 13-20 వరకు స్పష్టముగా వివరించిరి. (భక్తుని లక్షణాలు).

మనము ప్రపంచములో జీవరాసులన్నిటిని ప్రేమించ గల్గుచుంటిమా? మనకెవరూ శత్రువులు లేకుండా వుంటిమా? మనకు నిజమైన శత్రువులు బైటలేరు. మనలోపలనే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములను ఆరుగురు శత్రువులున్నారు. వాటిని జయించుటకే గదా మనకు అపురూపమైన మానవ జన్మ ప్రసాదింపబడినది. నిత్యము ఈ శత్రువులను తరిమి వేయ ప్రయత్నించక, మన అమూల్య ఆయుర్దాయమును వృథా చేసుకొననియెడల, మన పవిత్ర మానవజన్మ వృథాయేగదా? అందు వల్లనే క్షణములను వ్యర్థము చేయువారు జీవితమునంతయు వ్యర్థము చేయుదురను సూక్తి నిరంతరము శాంతి ఆశ్రమములో మారు మ్రోగుచున్నది.

విదేశీయులు మనదేశం వచ్చి శ్రీకృష్ణనామం అతిభక్తితో గానము చేయుచుండగా, మనమెంతగా శ్రీకృష్ణ చైతన్యము అనుభవించుచు, మన పవిత్ర మానవ జీవితములను ధన్యము చేసుకొనవలసి యుండునో ప్రతివారు తీవ్రముగా ఆలోచించవలసియున్నది. మానవజన్మ గమ్యస్థానము దైవమే అని ప్రతివారు సదాజ్ఞప్తియుందుంచు కొనగల్గితే, మన మనస్సు అనిత్యమైన ప్రాపంచిక విషయములవైపు పోక నిత్యమగు పరమాత్మను తెలుసుకొనుట యందే లగ్నమగును. భగవద్గీత సారాంశము, పరమాత్ముని తెలుసుకొని, ఆయనలో ఐక్యమై ముక్తిని సంపాదించుటయే గదా! కావున ప్రతి మానవుడు కనీసము గీతాజయంతి పుణ్య దినమునాడైనను పవిత్ర గీతాసారమును గ్రహించి యీ పవిత్ర భారతదేశములో జన్మించినందుకు మానవ జీవితము ధన్యము చేసుకొనెదరు గాక!

లోకాసమస్త సుఖినో భవంతు!

(శాంతి - జనవరి 1975)

# భగవత్ కృప

**మూలం : శ్రీ అఖండానంద సరస్వతీ మహరాజ్ అనువాదం : శ్రీమతి టి. ఛాయాకృష్ణ**

## బలి సౌభాగ్యము

ఈ విధముగా బ్రహ్మదేవుడు స్తుతించగా అదితి యొక్క గర్భము నుండి శంఖ, చక్రగదా పద్మధారి, పీతాంబరధారి, చతుర్భుజరూపముతో ప్రకటమయినాడు. ప్రాదుర్భభైవా మృత భూరదిత్యామ్ (1) కమల నేత్రములు, ఉజ్వలమైన శ్యామ వర్ణము, చెవులకు కుండలములు, వస్త్రాభరణములతోనూ, మధుపములు గుంజారము చేస్తున్న వనమాలతోను - ఆ సమయమున ప్రత్యక్షమైనాడు. దిక్కులన్నీ ప్రసన్నములయినవి. సంపూర్ణ ప్రకృతి తన సౌభాగ్యమును భగవంతుని చరణములలో నివేదన చేసుకున్నది. బాధ్రపదమాసము శ్రవణ నక్షత్రము, శుక్లపక్షము, ద్వాదశి తిథి, అభిజిత్ ముహూర్తము సమయంలో భగవంతుడు ప్రత్యక్షమైనాడు. ఈ సమయంలో సూర్యుడు సరిగ్గా మధ్య భాగంలో వున్నాడు. దేవతలు తమ వాయిద్యములను మ్రోగించినారు. సిద్ధులు విద్యాధరులు వారిని స్తుతించసాగిరి. అదితి యొక్క ఆశ్రమములో పుష్పవర్షము కురవసాగినది. నా గర్భము నుండి భగవంతుడు ఆవిర్భవించాడు. ధన్యము! ధన్యము!

మొదట భగవంతుడు చతుర్భుజ రూపమును ధరించినాడు. కానీ తల్లి తండ్రుల ఎదుట అతడు వామన వటువయినాడు. యాచించవలసిన పని చేసేటప్పుడు తన పెద్దరికము ఎలా చూపెడతాడు? యాచించే వాడెప్పుడు చిన్నగానే వుండాలి. భగవంతుడు కూడా యాచించేటప్పుడు చిన్నగా అవుతాడు. అడగాలంటే మరి బ్రాహ్మణుడు కావాలి. వామన వటువయినాడు. వెంటనే జాతకర్మాది కర్మలన్నీ చేయించారు. సూర్యుడు గాయత్రిని ఉపదేశించాడు. బృహస్పతి యజ్ఞోపవీతము చేయించాడు. కశ్యపుడు మేఖలనిచ్చాడు. భూమి మృగచర్మమునిచ్చినది. చంద్రుడు దండమునిచ్చాడు. మాత కౌపీనమునిచ్చినది. గోలోకము ఛత్రమునిచ్చినది. బ్రహ్మదేవుడు కమండలమునిచ్చాడు. సప్తర్షులు కుశలనిచ్చారు. సరస్వతీ దేవి రుద్రాక్షమాలనిచ్చినది. కుబేరుడు భిక్షాపాత్రనిచ్చాడు. ఉమ భిక్షను వేసినది. ఈ విధముగా దేవతలందరి సభలో సర్వశ్రేష్ఠుడైన వామన భగవానుడు వేదికను తయారు

చేసి అందులో అగ్నిని స్థాపన చేశాడు. పరిసమూహనము (చుట్టు దర్భలతో తుడుచుట) పూజ చేశాడు. సమిధలతో హవనము చేయనారంభించాడు.

ఆ రోజులలో శుక్రాచారుడు బలితో అశ్వమేధ యజ్ఞము చేయిస్తూ వున్నాడు. బ్రహ్మచర్యముతో, సంపన్నుడయిన వామన భగవానుడు దండమును గ్రహించి అదే యజ్ఞశాలవైపు నడిచాడు. నర్మదా తీరములో భృగుకచ్ఛక్షేత్రములో ఆ యజ్ఞము జరుగుతూ ఉన్నది. భృగు వంశీయులైన బ్రాహ్మణులు ఆ యజ్ఞమును చేయించు చుండిరి. ఇప్పుడు ఆ స్థానమును భడోక (భరోచ్) అంటారు. బరోడా, సూరత్‌కి మధ్యలో ఎక్కడ నర్మద కలుస్తుందో అక్కడ భృగుకచ్ఛమన్న పేరు గల స్థానమున్నది.

వామనుడి యొక్క తేజస్సును చూచి ఎవరీతడు సూర్యుడా! సనత్కుమారులా? అని అనుకున్నారు, బ్రాహ్మణులు. ఛత్రము వేసుకొని కమండలము తీసుకొని చిట్టిపొట్టి వామనుడు చిన్నవాడిలా అగుపించాడు. కాని వాస్తవమునకు అతడు సంపూర్ణ బ్రహ్మాండమును చుట్టబెట్టగల విష్ణు విరాట్టుడు 'వామనో హ విష్ణురాస' అని వేద వాక్యము! 'వేవేష్ఠి ఇతి విష్ణుః' సంపూర్ణ బ్రహ్మాండమునంతా వ్యాపించెడివాడినే విష్ణువని అంటారు. వామన భగవానుని చూచి బ్రాహ్మణులు అతనికి ఎదురు వెళ్ళి సత్కరించి తీసుకువచ్చి యజ్ఞశాలలో ఆసీనుడిని చేశారు. బలి వామనుని చూచి ముగ్ధుడయినాడు. అతడు వామనుని చరణములను కడిగి పాదోదకమును శిరమును చల్లుకున్నాడు. ఇక్కడ బలి యొక్క సౌభాగ్యము చూడండి! అతనికి సాక్షాత్తు అవ్యవహితమయిన గంగా జలము లభించినది. ఇది బ్రహ్మదేవుడి కమండలములోనికి పోలేదు. శంకరుని శిరసుపైన ఎక్కలేదు. బలి అన్నాడు. 'మహాత్మా మీ రాకవలన మా వంశము తరించినది. మాకు యజ్ఞయాగాదుల ఫలము లభించినది. మా భూమి పవిత్రమయిపోయినది. మీరు యజ్ఞభూమిలో మా వద్దకు వచ్చారు. కాన మీకు ఏమి కావాలో అది మమ్ములను అడగండి. గోవులు కావాలంటే గోవులు తీసుకోండి. స్వర్ణము కావలిస్తే స్వర్ణము తీసుకొనండి. ఇళ్ళు కావలసివస్తే ఇళ్ళ తీసుకోండి. అన్నము కావలిస్తే అన్నము తీసుకొనండి. బళ్ళు కావలసివస్తే బళ్ళు తీసుకొనండి. ఒకవేళ మీరు వివాహమాడ గోరితే సుయోగ్యురాలైన సుందరమైన సుకుమారి కన్యతో వివాహమును కూడా జరిపించగలము. గ్రామములు కావాలా? అశ్వములు కావాలా? ఏమి కావలసివస్తే అది తీసుకొనండి. ఇచ్చేటప్పుడు కృపణత చూపడం మంచిది కాదు. నవ్వు వచ్చినప్పుడు ఆపడము మంచిది కాదు. ఇక్కడ బలి తనను తాను బలి ఇవ్వడానికి తయారయిపోయాడు.

# తత్త్వమసి

**శ్రీ తెన్నేటి విశ్వనాథం**

## ప్రస్తావన

హైందవ సంస్కృతికి జీవనాధారము వేదములు. అవియే పరమ ప్రమాణములు. యజుర్వేదమునందలి **అహం బ్రహ్మోస్మి** ఋగ్వేదమునందలి **ప్రజ్ఞానం బ్రహ్మ;** అధర్వణ వేదము నందు **అయమాత్మా బ్రహ్మ;** సామవేదమునందలి **తత్త్వమసి** యనునవి చతుర్విధ మహావాక్యములు. వేదముల అంతిమ భావమనదగు యుపనిషత్తులు వేదాంతసారమై యొప్పు.

కాని నేడు జనబాహుళ్యమునకు సంస్కృత భాషా జ్ఞానములుప్తమై యుండుటచే తత్త్వజ్ఞానము తెలియు అవకాశము లేక యుండెను. మనకట్టి కొఱతతీర్చుటకై శ్రీ తెన్నేటి వారు సామవేదము నందలి చాందో గ్యోపనిషత్‌లోని ఆరవ అధ్యాయమునందలి తత్త్వమసీ నిరూపణా ఘట్టమును మృదు మధుర భాషలో రూప చిత్రణ గావించి మన ముందుంచిన సశాస్త్రీయమైన మన తత్త్వజ్ఞానమును చవిచూచి పాఠకులు ఆనందింతురు గాక!

ఓం ఓం ఓం

## పాత్రలు

శ్వేత కేతువు :- (ముని: వయస్సు 24)

తెల్లనిధోవతి, తెల్లని ఉత్తరీయమూ నల్లని పొడుగైన తల వెంట్రుకలమీది తెల్లని కేతువు భుజముపై నుంచుకొనును.

ఋషి కుమారుడు :- వయసు పదునైదు, పదునారు.

కాషాయ వస్త్రములు, జడలు వెన్కకువిరిచి కట్టబడి ఉండును.

ఉద్దాలకుడు :- ఒక ముని, నిగ నిగలాడు వెండి తీగలవంటి జుట్టుముడి, చేతికి బంగారు కంకణము, కాల్చిన బంగారురంగు దేహచ్ఛాయ, మోకాళ్ళపైనున్న పంచకట్టు, భుజముపై ఉత్తరీయము.

అందరూ పాదరక్షలు ధరింతురు.

- నాంది (తెరలో) -

"ఓం ఆప్యాయన్తు మమాంగాని వాక్ప్రాణచక్షుశ్శ్రోత మథోబలమింద్రియాణిచసర్వాయే ఉపనిషత్సు ధర్మాః తే మయినన్తు మయిసన్తు"

ప్రవేశము సూత్రధారుడు

1,2,3,4 ఋషి కుమారులు

ఋ॥కు॥ (వీక్ష కంఠముతో) నమోనమః

సూ॥ దీర్ఘాయుష్మంతః భవన్తు

ఋషి కుమారకుమార!

ఏ ఆశ్రమ విద్యాభ్యాస

భాగ్యము కలదు మీకు?

1 ఋ॥ కు॥ స్వామీ, మేము రాధీతర

ఋష్యాశ్రమ శిష్యులము.

సూ॥ సత్య వచస్కుడాతడు;

ఇటకేల వచ్చితిరి?

2 ఋ॥ కు॥ ఉద్దాలక మహర్షులు...
3 ॥ కుమార రత్నముగారు...
4 ॥ గురుకులాశ్రమంబులో
విద్యా పూర్తిచేసికొని
వచ్చినాడని వింటిమి...
3 ఋ॥ కు॥ అతగాని చూతుమని...
చూచుటకు కాదు స్వామి...
సూ॥ మరి?
3 ఋ॥ కు॥ వారి వైఖరి చూతుమని
బుద్ధి పుట్టినది మాకు
కాని త్రోవ తప్పినాము
సూ॥ ఏమిటేమిటి! మీవంటి
కుమార రత్నము లేమి
త్రోవను తప్పుట లేమి?
ఆ వట వృక్షమదిగో
అది త్రిశతాబ్దజీవి
అష్ట దిశలూ, ఊడల
బారినదై మహారాజ
భవన మటులున్నది.
ఆ ప్రక్కను ఉన్న రావి
చెట్లు, రెంటిని చూడండి,
ఆ వెన్కను ఉన్నపూల చెట్లు,
వాటి మధ్య విరిసిన
పద్మములు గల చెర్వు:
దాని వెన్క కుటీరము
గోచర మగుచున్నదా?
ఆది ఉద్దాలక ఋషి
నివసించు కుటీరము
దాని భాగ్యమే భాగ్యము.
ఋ॥ కు॥ (అందరు కలిసి) నమస్తేస్తు: ధన్యులము.
3ఋ॥కు॥ పేరు వినుటయే గాని
ఆయనను చూడలేదు
ఇంతవరకును మేము.
సూ॥ వెండితీగల వలెను
మెరసే మీసములును
గడ్డమును, నెత్తిపైన
తెల్లటి శిరోజముల
చక్రగ్రంథి; ఒక చేత
కమండలము; ముంజేతి
బంగారు కంకణములు;
పుష్టియైన శరీరము:
పచ్చని దేహకాంతులు;
గౌరవ ప్రదమయిన

ముఖవర్చస్సు ఉండిన
యాతడే ఉద్దాలకుడు;
ఋషులందరినీ, జూచి
వెంటనే పోల్చగలరు.
ఋ॥ కు॥ ఆయన మాటకేమండి;
ఆయన కుమారుడట,
శ్వేత కేతువట, పేరు
3, 4॥ అట ఎమిటయ్య, బోర
విరుచుక ఈ వైపున
ఇప్పుడేగద, నడచి
పోవునాతని, గంటిమి
సూ॥ నిజమే, మీ వచనము;
ఆ బోర విరుచుకొని
నడిచేటి లక్షణము.
గురుకులములనుండి
సమావర్తను లైనట్టి
స్నాతకు లందరికిని
గల సామాన్య లక్షణం;
నాలుగు రోజులు అది
అలాగుననే ఉండును.
వాని మాట కేమిగాని,
ఉద్దాలక మహర్షుల
మహత్త్వము వినినార?
ఋ॥ కు॥ మాకంతయు క్రొత్తేనండి;
మీరు చెప్పండి; విందుము
మీ॥ అతడు మహాశయుడు
వాచస్పతి ఆత్మదర్శి;
చెప్పుటకు నే చాలను.
3 ఋ॥ కు॥ మీకంటే, మరెవరండి
చెప్పనేర్చినట్టివారు?
సూ॥ స్వోత్కర్షము సచ్ఛాత్రులు
చేసికొనరాదు, గద
రాథీతర ఋషి శ్రేష్ఠు
డే పెద్దల గురించియు.
ప్రసంగ వశమునైన
పలుకలేద, మీతోడ?
ఋ॥ కు॥ ఇంకను క్రొత్త వారము
గద మేము ఆయనకు;
మీరు చెప్పండి, విందుము
సూ॥ ఉద్దాలకుని గురించి
వారి తత్త్వము గురించీ
చెప్పగల వారున్నారు.
3ఋ॥ కు॥ ఎవరండి, వారిపేరు?

సూ॥ షడానన పట్నవాసి
వాసిగన్న వేదజ్ఞాని
జ్ఞానబోధకుల మేటి
ఉపనామము తెన్నేటి
ఋ॥ కు॥ అవునండి, అవునండి,
యాజ్ఞవల్క్య రచనతో
నాసదీయ భాష్యముతో
పేరుగన్న వారేనండి
సూ॥ ఆయనను మీరుచూచి...
ఆశ్చర్యము! ఆశ్చర్యము!
మునగబోవు తీర్థము
ఎదురుగ వచ్చినది
ఇటకెపుడు వచ్చిరో-
అరుగో, అరుగో, వారే.
ఆ శుభవస్త్రధారులే
ఆ సులోచన ధారులే
నే చెప్పు తెన్నేటి వారు
వారాశ్రమములోనికే
వెళ్ళుచున్నారు. మనము
కూడ లోనికి వెళ్ళిన,
వారిని, మహర్షులను
యువఋషి శ్వేతకేతు
వును కూడ చూచెదము
వినుదవి, సామవేద
శాంతి మంత్ర రాజములు:
మధుర స్వరములవి.
(లోనికి నడచుచుండగ తెరదిగును)

## తొలి

తొలి ఉదయం - తొలి కిరణం
తొలి అడుగు - మొట్టమొదట
ఏమీ తెలియని - మనిషికి
ఇవే బాటలు - ఇవే సాధనలు
అంతులేని అసహనం కలిగినా
అంతులేని విషాదం కలిగినా
గుండెకు ధైర్యాన్ని నింపేవి
తొలి ఉదయం
తొలి కిరణం
తొలిపాఠం

# శ్రీ తులసీ సర్వస్వము

అధ్యాయము - 2 జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యశర్మ

## 15. తులసి మహావృక్షము

### తులసి మాలను ధరించినవాడు విష్ణువుకు ప్రీతి పాత్రుడగును

### ఎ. తులసి మహావృక్షము

తులసీవివాహము అను శీర్షికలో తులసీమహావృక్షము పవిత్రమయిన వృక్షము, ఎట్లయినదో తెలిసికొంటిమి. ఈ విషయమునే నిరూపించుటకు ఈ క్రింది వాక్యములు కూడా ఇట్లు విష్ణుమూర్తి పేర్కొనుచున్నాడు.

**శ్లో॥ వృక్షాధిష్ఠాతృదేవీ యా గోలోకేచ నిరామయే ।**
**కృష్ణేనసార్థం నిత్యంచ నిత్యక్రీడాం కరిష్యసి ॥**

తా॥ ఓ తులసీదేవీ నీవు ఒక వృక్షమునకు (ఆ తులసికి) అధిష్ఠాన దేవతవు. నిరామయురాలివి. గోలోకమునందు కృష్ణునితో కలిసి నిత్యము నిత్య క్రీడను చేయుదానివి.

**శ్లో॥ వృక్షాధిష్ఠాణదేవీ యా గోలోకే సా సుపుణ్యదా ।**
**లవణోదస్య సా పత్నీ మదంశస్య భవిష్యతి ॥**

తా॥ తులసి వృక్షమును అధిష్ఠించిన దేవివి నీవు. గోలోకవాసులకు నీవు మిక్కిలి పుణ్యమును కలిగించుదానవు. నా దేహము నుండి ఉద్భవించిన విరజానదికి అధిష్ఠాన దేవతవై, లవణ సముద్రమునకు భార్య వయ్యెదవు.

### బి. తులసి వృక్షరాజము

పూజించు వృక్షములు 1. తులసి. 2. రావి. 3. జమ్మి మొదలగునవి. వానిలో నిత్యపూజలందుకొను వృక్షము తులసి మాత్రమే. జలంధరుని భార్యయగు బృంద విష్ణువు యొక్క శాపము చేత వృక్షముగా మారి, నిత్యపూజలు అందుకొను భాగ్యమునకు నోచుకొన్నదని బృందాదేవి యొక్క జీవిత చరిత్రలో తెలిసికొనియుంటిమి కదా! ఆ వృక్షము యొక్క ప్రశస్తిని ఇక తెలిసికొందము.

### సి. తులసిని సామాన్య వృక్షముగా పరిగణింపరాదు

శౌనకాది మహర్షులు దేవర్షియగు నారదుని వద్దకు చేరి, ప్రణమిల్లి ఇట్లనిరి.

శ్లో॥ అశ్వత్థస్య తులస్యాశ్చ మాహాత్మ్యం సూచితం పురా ।
త్వయైవ త ద్వద స్వామిన్! భూయో భాగవతీః కథాః ॥

(హరి. భ. సు. అధ్యా 18-4)

ఓ నారద మహర్షీ! నీవే పూర్వము అశ్వత్థవృక్షము యొక్కయు, తులసి వృక్షము యొక్కయు మాహాత్మ్యములను చెప్పితివి కదా! ఇంకను ఆ భగవతి కథలను వినగోరుచున్నాము అని అడిగినప్పుడు

"వైష్ణవుని సామాన్య మానవునిగాను, అశ్వత్థ వృక్షమును, తులసిని, సామాన్య వృక్షములుగాను పరిగణించుట దోషము." (హరిభక్తి సుధోదయము అధ్యా 18) అని నారదుడు తులసీ మాహాత్మ్యమును వివరించినాడు.

ఒకప్పుడు వసిష్ఠుడు మున్నగు మహర్షులు గంగాపులినభాగము నందు సమావిష్టులైరి. అప్పుడు మార్కండేయుడు పరాశర మహర్షి కిట్లు చెప్పెను.

"వయో జ్యేష్ఠత్వము జ్యేష్ఠత్వము కాదు. గుణజ్యేష్ఠత్వమే మిన్నయైనది.

శ్లో॥ నేతరోఽఖ్యేతి తులసీం ।

సుమహానపి వృక్షకః ॥ (హరిభక్తి సు. 18–28)

ఎంతటి పెద్ద ఇతరవృక్షమైనను చిన్నదగు తులసిమొక్క యొక్క మాహాత్మ్యమునకు సాటిరాదని భావము.

పారిజాతస్రజం హిత్వా

యాం భిభర్తి ముదా హరిః ।

విష్ణుప్రియా సా తులసీ

కథం వీరుత్సు గణ్యతే? (హరిభక్తి సుధోదయము అధ్యాయము 18–29)

అలంకారపు విషయమునందు శ్రీమహావిష్ణువు, పారిజాతపుష్పమాలను కూడా విడిచివైచి మిక్కిలి మక్కువతో ఏ తులసి మాలను ధరించునో విష్ణువునకు మిక్కిలి ప్రియమైన ఆ తులసిని సామాన్య వృక్షములలో ఒకటిగా ఎట్లు పరిగణింపగలము? పరిగణింపరాదని భావము. అని హరిభక్తి సుధోదయ గ్రంథము ప్రకటించుచున్నది.

## డి. తులసిలోని రకములు - కారణము

తులసి 1. కృష్ణ తులసి, 2. శుక్ల తులసిగా రెండు రూపములను ధరించినది. వీనిలో కృష్ణతులసి శ్రేష్ఠమైనది.

శ్లో॥ సత్త్వం ప్రీతికరం వాక్యం, కోప స్తస్యాస్తు తామసః ।

భావద్వయం హి హరేః జాతం, ఏతత్ వర్ణద్వయం హ్యభూత్ ॥

తా॥ తులసీదేవికి విష్ణువు మీద రెండు రకముల భావములు ఏర్పడినవి. ఆ భావములలో

1. శ్రీకృష్ణునకు ప్రీతికరమైన వాక్యములను చెప్పుచు సాత్త్విక భావమును తులసీ దేవి ప్రదర్శించినది. ఆ సాత్త్విక భావపు తెల్లరంగే శుక్ల తులసి (తెల్లనిది) అయినది.

2. జలంధరుని (లేక) శంఖ చూడుని భార్యగా ఉన్నప్పుడు ఆమె సతీత్వమును భంగపరిచినాడను భావముతో బృందాదేవికి ఆ విష్ణువు మీద కోపము కలిగినది. ఆ కోపకారణముగా ఆమె శరీరము నల్లబడి పోయినది. అది యే కృష్ణతులసి అయినది.

శ్లో॥ శ్యామాపి తులసీ విష్ణోః ప్రియా గౌరీవిశేషతః । (పద్మపురాణము)

తా॥ విష్ణువు మీది కోపముతో తులసీదేవి నల్లబడినను ఆమె అతనికి శుక్ల తులసి కంటె మిక్కిలి ప్రీతిపాత్రురాలే అయినది.

# బుసకొట్టు కాని కాటెయ్యకు

మూలము : శ్రీ రామకృష్ణ పరమహంస  అనువాదము : గరిగిపాటి కృష్ణ

## మహాత్ముల కోపము నీటిపై వ్రాతవలె వుంటుంది

కొంతమంది గోపాలకులు తమ గోవులను ఒక పచ్చిక మైదానములో మేపుతూ ఉండేవారు. ఆ మైదానములోనే ఒక భయంకరమైన విషసర్పము కూడా నివసిస్తూ ఉండేది. ఆ గోపాలకులు ఎప్పుడూ ఆ పాముకి భయపడుతూ అప్రమత్తంగా ఉండేవారు. ఒకనాడు ఒక బ్రహ్మచారి ఆ మైదానము గుండా వెళుతూ కనిపించాడు. ఆ బాలకులు అతని వద్దకు పరుగున పోయి, “మహాత్మా, మీరు అటు వైపు వెళ్ళకండి. అక్కడ ఒక విష సర్పము నివసిస్తూ ఉన్నది.” “అయితే ఏమైంది, పిల్లలూ, నాకు సర్పమును గూర్చి ఎటువంటి భయము లేదు. నాకు కొన్ని మంత్రములు తెలుసు.” అలా అంటూనే అతను ముందుకు సాగాడు. కాని ఆ గోపబాలకులు భీతి చెందినవారై అతడి వెంట వెళ్ళలేదు. అంతలో ఆ సర్పము తన పడగను పైకెత్తి, ఆ బ్రహ్మచారి వద్దకు వడివడిగా రాసాగింది. అది తన వద్దకు రాగానే అతడు ఒక మంత్రాన్ని పలికాడు. అంతే, ఆ పాము అతని పాదాల వద్ద ఒక వాన పాము వలె ముడుచుకొని పడుకుంది. బ్రహ్మచారి ఆ సర్పముతో “చూడు, నీవు ఎందుకు ఇతరులకు అపకారము చేస్తావు. ఇలా రా! నేను నీకొక పవిత్ర మంత్రాన్ని ఉపదేశిస్తాను. దానిని నీవు పునశ్చరణ చేస్తూ ఉన్నట్లయితే నీకు భగవంతుని పట్ల ప్రేమ కలుగుతుంది. చివరిగా నీవు భగవంతుని తత్వాన్ని గ్రహించి నీలో ఉన్న హింసా ప్రవృత్తిని విడనాడగలవు.” ఇలా అంటూనే అతడు ఆ సర్పానికి ఒక మంత్రాన్ని ఉపదేశించి దానిని ఆధ్యాత్మిక జీవనం వైపు తొలి అడుగు వేయిస్తాడు. అంత ఆ సర్పము బ్రహ్మచారికి నమస్కరించి “మహాత్మా, నేను ఆధ్యాత్మిక నియమాలను ఏ విధంగా అనుసరించాలి.” అంత ఆగురువు “నీవు మంత్రాన్ని జపిస్తూ ఉండు. అంతేగాక నీవు ఎవరినీ హింసించవద్దు.” అంటూ ఆ బ్రహ్మచారి తిరిగి వెళుతూ “నేను మళ్ళీ నిన్ను చూడడానికి వస్తాను” అని అంటాడు.

అలా కొన్ని దినములు గడిచాయి. గోపాలురు పాము కాటు వెయ్యదని గమనించారు. వాళ్ళు ఇదే అదనుగా భావించి ఆ పామును రాళ్ళతో కొట్టసాగారు. అయినా ఆ పాము వాళ్ళ మీద కోపించి తిరగబడలేదు. అది ఒక వానపాము వలె నిశ్చలంగా ఉండిపోయింది. ఒకరోజు ఒక బాలకుడు ఆ పాము దగ్గరకు వెళ్ళి దాని తోకను పట్టుకొని గుండ్రంగా త్రిప్పుతూ నేలకేసి అనేక మార్లు కొట్టి దాన్ని దూరముగా విసిరివేసాడు. ఆ పాము రక్తము  వాంతి చేసుకొని స్పృహ తప్పి పడిపోయింది. దాని మెదడు మొద్దు బారి పోయింది. అది కదలలేని స్థితిలో పడి ఉంది. అది చనిపోయిందని భావించిన గోపబాలురు, వారి వారి స్వస్థలాలకు వెళ్ళారు.

ఆ రాత్రి చాలా సమయము గడిచిన తరువాత పాముకు స్పృహ వచ్చింది. నెమ్మదిగా ఎంతో కష్టపడి అది తన పుట్టలోనికి వెళ్ళగలిగింది. దాని ఎముకలు

ముక్కలుగా విరిగి పోవడము చేత అది కదలడానికి విపరీతంగా కష్టపడవలసి వచ్చింది. ఇలా అనేక రోజులు గడిచాయి. ఆ పాము చర్మం కప్పిన అస్థిపంజరంలా బలహీనంగా తయారయింది. అప్పుడప్పుడు రాత్రి సమయాల్లో, అది బయటకు ఆహారం కొరకు వస్తూ ఉండేది. గోపాలుర భయంతో అది పగటి సమయంలో తన పుట్ట వదలి బయటకు వచ్చేది కాదు. తన ఆచార్యుని వద్ద మంత్రోపదేశము అయిన తరువాత ఆ పాము ఎవరికి అపకారము చెయ్యడానికి తలపెట్టేది కాదు. అది తన బ్రతుకు చెత్త, ఆకులు, చెట్లనుండి రాలిన ఫలాలను తిని వెళ్ళదీస్తూ ఉండేది.

ఒక సంవత్సరము గడిచాక ఆ బ్రహ్మచారి అటువైపుకు వచ్చి ఆ పాము గురించి వివరము తెలుసుకోగోరాడు. ఆ గోపబాలురు అతనికి ఆ పాము మరణించిందని తెలిపారు. కాని, ఆ బ్రహ్మచారి ఆ బాలురు చెప్పిన మాటను నమ్మలేదు. ఎందుకంటే ఆ సర్పము ఆ మన్త్ర జపము యొక్క ఫలము అనుభవించకుండా మరణించజాలదు. అందుచేత ఆ దారిలోనే కొంత దూరము వెళ్ళి ఆ పాము కొరకు ఇక్కడా, అక్కడా వెదకి, పాముకు తను ఇచ్చిన పేరుతో పిలవసాగాడు. గురువు గారి మాటలు విన్న పాము కలుగు బయటకు వచ్చి తన గురువుకు శ్రద్ధాభక్తులతో నమస్కరించింది. “ఎలా ఉన్నావు?” అని బ్రహ్మచారి అడుగగా ఆ పాము, “నేను బాగానే ఉన్నాను” అని బదులిచ్చింది. కాని నీవు అంత చిక్కి పోవడానికి గల కారణమేమిటని బ్రహ్మచారి అడుగగా ‘మహాశయా, మీరు నన్ను ఏ ప్రాణినీ హింసించవద్దని కదా ఆదేశించారు. అందుకని నేను ఆకులు, పళ్ళతో నా కడుపు నింపుకుంటున్నాను. బహుశ, అదే నేను చిక్కడానికి కారణమై ఉండవచ్చు అన్నది.

ఆ సర్పము మంత్ర సాధన ద్వారా సత్వగుణాన్ని వృద్ధి చేసుకున్నది. దానికి ఎవరిపైనా ఆగ్రహం కలుగదు. అది గోపాలురు తనను దాదాపు చంపబోయిన విషయాన్ని కూడా మరచిపోయింది. అంత బ్రహ్మచారి, “కేవలము ఆహారమే నీ ఈ ప్రస్తుత స్థితికి కారణముగా అనిపించటములేదు. దానికి వేరే ఇతర కారణము ఏదైనా ఉందేమో ఆలోచించి చెప్పవలసింది అన్నాడు. అపుడా పాము తనను గోపాలురు నేలకేసి బాదిన విషయము స్ఫురణలో కొచ్చింది. అప్పుడా పాము ఇలా అంది, “మహాశయా, ఇప్పుడు నాకు జ్ఞాపకం వచ్చింది. ఆ బాలురు ఒక రోజు నన్ను బలంగా నేలకేసి బాదారు. వాళ్ళ తప్పేమీ లేదు, పాపం, అమాయకులు. వాళ్ళకి మానసికంగా నాలో కలిగిన పరిణామము గురించి తెలిసి ఉండదు. నేను ఎవరినీ కాటు వెయ్యను, బాధపెట్టను అని వారికి ఎలా తెలుస్తుంది.” అపుడు బ్రహ్మచారి, “సిగ్గు చేటు, నీవెంత మూర్ఖుడివి. నిన్ను నీవు ఎలా రక్షించుకోవాలో నీకు తెలియదు. నిన్ను కాటు వెయ్యవద్దన్నాను కాని, బుసకొట్ట వద్దనలేదే! నీవు వాళ్ళని బుస కొట్టి భయ పెట్టవచ్చును కదా.”

అందుచేత నీవు క్రూరులైన వారి ముందు బుస కొట్టవలసిందే. నిన్ను వాళ్ళు బాధించకుండా ఉండేలా వాళ్ళని భయపెట్టడం తప్పుకాదు. కాని ఎప్పుడూ నీ విషాన్ని వాళ్ళకి ఎక్కించవద్దు. ఒకరు వేరొకరిని గాయపరచరాదు.

# దివ్యభావన

స్వామి రామదాసు

## తీవ్ర ప్రేమతో భగవన్నామాన్ని స్మరించాలి

పరమ శుభదాయకమైన భగవత్సాక్షాత్కారమును పొందడానికి దివ్య భావనతో మన మనస్సును సంతృప్తిపరచాలి. మనస్సనేది లేనిదై దైవమొక్కటే ఉండేదాకా దేవుడు మన మనస్సును తన స్వాధీనములోనికి తీసుకొనాలి. ఇది జరిగేవరకు, అంటేదివ్య భావన ఒక్కటే సాధకుని మనస్సుపై పెత్తనము చలాయించునట్లు మనస్సును, దాని క్రియలను నియంత్రించుటకు అతడు సర్వశక్తులను ఒడ్డాలి. మనస్సుకు ఉండే వెకిలితనము, అవిశ్రాంతత, అశుద్ధప్రవృత్తి అనేవాటి స్థానములో ఉత్సాహము, స్వచ్ఛత, శాంతి అనేవి వచ్చి చేరు విధంగా దివ్య ఆలోచన మనస్సు లోపొరల లోలోపలికి చొచ్చుకుపోవాలి. దైవభావనయందు మనస్సు వసించునట్లుచేయు సులువైన మార్గము ఏమిటంటే మానసికంగా గాని, స్వరయుక్తంగా గాని భగవన్నామాన్ని నిరంతరము స్మరించుచుండాలి. నామస్మరణ శక్తి అమోఘమైనదనెడి నిశ్చల విశ్వాసము కలిగి, నామము ప్రాతిపాదించే అమృత భావనయందు తీవ్రమైన ప్రేమతో నామస్మరణను గావించాలి. పరమసత్యము సచ్చిదానందమని, అది సర్వుల హృదయాల యందు ఆసీనమై యున్నదని భావించాలి. ఆ విధంగా మనస్సు దివ్య భావనయందు సంపూర్తిగా విలోలమై యున్నప్పుడు వ్యష్టి లేదా భౌతిక చైతన్యము సార్వత్రికము మఱియు సదా ఆనందదాయకమైన దివ్య చైతన్యమునకు పరివర్తన నొందు స్థాయికి చేరుకొనును.

ఎన్నడును ఆత్మ విశ్వాసమును వీడకుము. సమస్తము భగవంతుడు నీకు సమకూర్చును. వానిని నమ్మియుండుము. భగవన్నామమును స్మరింపుము, జపింపుము. భగవంతుడు నీకు పరమార్థమును తెలుపును. ఆందోళన పడకుము. ఓరిమితో, పూనికతో సాధన చేయుచుండుము. తప్పక పరమాత్మను ప్రాప్తింతువు. అమూల్యమైన నీకాలమును నిరర్థక చింతలతోడను, వ్యర్థము చేసికొనకుము. విషయ వాంఛలు నీ మనస్సున దల ఎత్తకుండుటకై భగవంతుని ప్రార్థింపుము. భగవత్కృప ఎల్లరయందును ప్రకాశించుచునే యున్నది. కొంచెము ప్రయత్నించితివా, భగవత్కృపను గాంచగలవు.

శ్రీ బ్రహ్మానందస్వామి

# గుణపాఠం

## పనిచెయ్యని వానికి తినే హక్కు లేదు

అనగనగా ఒక రాజ్యంలో ఒక రాజుగారుండేవారు. ఆయన ఎంతో మంచివారు. ఆయన ఎప్పుడూ ఆపదలో, అవసరంలో ఉన్నవారిని ఆదుకోవడానికి సిద్ధంగా ఉండేవాడు. ఆ రాజుగారి దర్బారుకు ఒక రోజు ఓ సోమరి దంపతులు వచ్చారు. "ఏమి కోరి వచ్చా" రని రాజు వారిని అడిగాడు. తాము ఏమీ లేని పేదవారమని, ఏదైనా జీవనోపాధి చూపించమని వారు రాజును వేడుకొన్నారు.

"ఆ పేదవారికి రెండుగేదెలను ఇస్తే వారు పాడి చేసుకొని, పాలను అమ్మి జీవిస్తారని రాజుగారు మంత్రిని ఆదేశించారు. మంత్రిగారు అందజేసిన పాడి గేదెలతో వారు ఆనందముగా ఇంటికి వెళ్ళారు.

ఒక వారం తరువాత ఆ సోమరి దంపతులు మళ్ళీ రాజ దర్బారుకు వచ్చారు. రాజు గారు వారిని ఏమి కావాలని అడిగారు. తాము ఇండ్ల వెంట తిరిగి పాలను అమ్ముకోవడం చాలా కష్టంగా ఉన్నదని వారు విన్నవించుకున్నారు. పాలను అమ్మే విషయంలో తమకు సాయంకావాలని అడిగారు. దానికా రాజు ఓ పశువుల కాపరిని పిలిచి, రోజూ వారింటికి వెళ్ళి పాలు తీసుకొని, ఇంటింటికి వెళ్ళి ఆ పాలను అమ్మి, ఆ ధనాన్ని వారికి ఇమ్మన్నాడు. సంతసించిన ఆ దంపతులు రాజును స్తుతిస్తూ ఇంటికి వెళ్ళారు.

ఇంకోవారం తరువాత ఆ సోమరి దంపతులు మళ్ళీ రాజ దర్బారుకు వచ్చారు. ఈ సారి వారు తమకు గేదెలను మేపడం, పాలుపితకడం చాలా కష్టంగా ఉన్నదని మొరపెట్టుకున్నారు. ఈ విషయంలో సాయానికై ఎవరినైనా పంపిస్తే కృతజ్ఞులమై ఉంటామన్నారు. రాజు తన పశువుల కాపరులలో ఒకరిని రోజూ వారింటికి వెళ్ళి గేదెలను మేపి, పాలు పితికి రమ్మన్నాడు. ఆ దంపతులు మరలా రాజును ఘనంగా స్తుతిస్తూ ఇంటికి వెళ్ళారు

మరో వారం రోజుల తరువాత వారు మరలా రాజ దర్బారులో ప్రత్యక్షమయ్యారు. ఈసారి వారు చాలా విచారంగా, తమకు రోజూ వంటచేసుకోవడం చాలా కష్టంగా ఉందన్నారు. ఒక వంటవానిని పంపిస్తే, రాజు గారి పేరు చెప్పుకుంటామన్నారు. రాజు వారిని గాబరా పడవద్దని చెప్పి, వారికి వండి పెట్టడానికి తన వంట వారిలో

ఒకరిని పంపుతానని చెప్పాడు. ఆ దంపతులు అమితానందంతో రాజుగారిని మరింత ఘనంగా స్తుతిస్తూ ఇంటికి వెళ్ళారు.

మరుసటి రోజు ఉదయం ఒక వంటవాడు వారి ఇంటికి వచ్చాడు. ఆ ఇంటి యజమానురాలు అతనికి వంటగదిని చూపించి, సరుకులు ఇచ్చి, ఏమి వండాలో, ఎలా వండాలో చెప్పింది. తమకు ఆహారం ఖచ్చితముగా మధ్యాహ్నానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించింది. వంటవాడు అలానే అని తల ఊపాడు.

ఆ దంపతులు మధ్యాహ్నం పండ్రెండు గంటలకు నిద్రలేచి, భోజనానికై వంటగదికి వెళ్ళారు. భోజనపు బల్లపై రెండు భోజన పళ్ళాలు సిద్ధంగా ఉన్నాయి. వంటవాడు ఆహార పదార్థాలతో సిద్ధంగా ఉన్నాడు. అంతా వారి ఆదేశాలమేరకు బాగానే ఉన్నదని ఆ దంపతులు తృప్తిపడ్డారు. వారు భోజనానికై కాళ్ళూ చేతులు శుభ్రపరచుకుని తిరిగి వచ్చేటప్పటికి, ఆ భోజనపు బల్ల దగ్గర తమకు తెలియని బలమైన ఒక దంపతులు కూర్చుని వారి కోసం సిద్ధంగా ఉన్న వంటకాన్ని తినడం ప్రారంభించారు. వండిన పదార్థాలన్నీ వంటవాడు ఒకదాని తరువాత ఒకటిగా జాగ్రత్తగా వినయంతో వారికి వడ్డించసాగాడు. ఆ సోమరి దంపతుల కళ్ళెదుటే, వచ్చిన దంపతులు సుష్టుగా భోంచేశారు. దీనికి దిగ్భ్రాంతి చెందిన ఆ సోమరి దంపతులు, "మీరెవరు? మా ఇంటికి వచ్చి మా భోజనాన్ని ఆరగిస్తున్నారేమిటి?" అని గద్దించారు.

దానికి వారు తలెత్తి చిరునవ్వుతో, "మీకు తినడంలో సహాయం చేయడానికని రాజుగారు మమ్మల్ని పంపించారు. ఇక నుండి మీకు తినే బాధ కూడా ఉండదు. రోజూ మీ బదులుగా మేము తింటాము. మీకస్సలు ఏ కష్టమూ ఉండదు. వెళ్ళి విశ్రాంతి తీసుకోండి," అన్నారు.

వెంటనే, ఆ దంపతులు రాజదర్బారుకు పరుగెత్తుకు వెళ్ళి, "ఓ దయగల రాజా! మీరు మాకు పంపిన సహాయాన్నంతా వెనుకకు తీసుకోండి. ఇకనుండి మా పనులను మేము సక్రమంగా చేసుకుంటాం," అని ప్రాధేయపడ్డారు. దానికి రాజు పెద్దగా నవ్వుతూ, ఆమోదంగా తల ఊపాడు.

సోమరితనానికి తగినగుణపాఠం చెప్పాల్సిందే!

(చిన్మయా మిషన్ వారి సౌజన్యంతో...)

# విజ్ఞప్తి - గోసంతతికై గోశాల విస్తరణ

**నమోదేవ్యై మహాదేవ్యై సురభ్యై చ నమో నమః । గవాం బీజ స్వరూపాయై నమస్తే జగదంబికే॥**
**మహాదేవీ, గోబీజ స్వరూపిణి, జగదంబికా । సురభిమాతా, నీకు నమస్కరించు చున్నాను.**

ప్రేమమూర్తులైన, ఆశ్రమ భక్తులకు పూజ్య స్వామి ఓంకార్ మరియు మాతాజీ వారి యొక్క దివ్య ఆశీస్సులు.

మీ అందరి సహకార సంపత్తులతో, ఆశ్రమంలో తలపెట్టిన బృహత్ పథకం అయిన "గోశాల మరియు కృష్ణమందిరం నిర్మాణం", విజయవంతంగా పూర్తి అయ్యి మార్చి నెలలో పూజ్య మాతాజీ దివ్య హస్తములతో ఘనంగా ప్రారంభమయిన విషయం మీ అందరికీ ఇదివరలో పత్రికా ముఖంగా తెలియపరచడమైనది.

ఈ గోశాల నిర్మాణం వలన గోవులు, లేగదూడలు ఎంతో సౌకర్యంగా, ఆరోగ్యకరంగా ఉంటున్నాయని తెలుపుటకు చాలా ఆనందంగా వుంది. ఇందుకు గాను సహకరించిన సహృదయులు అయిన భక్తులు అందరికీ మరొక్కసారి కృతజ్ఞతలు మరియు ఆశీస్సులు.

గత సంవత్సర కాలంగా సంఖ్యాపరంగా పెరిగిన లేగదూడలు ఉండుటకు, సేద తీరి పచ్చిక మేయుటకు, వాటికి ప్రత్యేకంగా, కొంత విశాల ఆవరణతో కూడిన చిన్న షేడ్ నిర్మాణం అవశ్యం అనిపించింది.

ఈ ప్రతిపాదనలో, 100' × 50' అడుగుల కొలతలు గలిగి, ప్రహరి గోడ, గేటుతో కూడిన ఒక విశాల ఆవరణ, అందులో 20'×40' సైజు గల, ఒక రేకుల షెడ్ మరియు చిన్న నీటి తొట్టి నిర్మించాలని తలపెట్టడం అయ్యింది.

ఈ ప్రతిపాదనకు సుమారుగా రూ.6.50 లక్షలు కాగలదని అంచనా వేయడం అయ్యింది.

ఈ బృహత్కర నిర్మాణంలో భాగస్వాములు కాదలచిన ఆశ్రమ భక్తులు, ఔత్సాహిక ఆశ్రమ భక్తులు, ఔత్సాహిక దాతలు విరాళములు ధనరూపంలో/చెక్కు/ ఎస్.బి.ఐ. కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435కు ఆన్‌లైన్ ద్వారా శ్రీ శాంతి ఆశ్రమం పేరున పంపగలరని విజ్ఞప్తి. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకముగా లేదా ఇమైల్ ద్వారా లేదా మొబైల్ నంబరు 7382009962కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు. మీ విరాళములకు సెక్షన్ 80జి ప్రకారము ఆదాయపు పన్ను మినహాయింపు కలదు. రూ. 10,000/-కు పైన ఇచ్చిన దాతల పేర్లు శిలాఫలకము మీద వ్రాయబడును. ఈ బృహత్తర కార్యక్రమంలో వారి వారి శక్త్యానుసారము సహకరించవలసినదిగా మా విన్నపము.

ఓం తత్ సత్

గురుసేవలో
**వినమ్రానంద సరస్వతి**

# దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ, కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435కు ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా లేదా మొబైల్ నంబరు 7382009962కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

# శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)

వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

# విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com కి తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు :State Bank of India, 11 Sansad Marg, New Delhi-110001

A/c Name : THE MISSION OF PEACE - FCRA A/c No : 40127798428

Swift Code : SBININBB104

**1. మాతృ ఆశ్రమం**
శ్రీ శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు, పిన్ : 533 446.
వయా శంఖవరం, తూ.గో.జిల్లా.
సెల్ : 7382009962
రిసెప్షన్ : 6305349677
e-mail:srisanthiashram@gmail.com

**2. విశాఖ : శాంతి ఆశ్రమము**
లాసన్స్‌బే, పెదవాల్తేరు - 530 017
విశాఖపట్నం.
ఫోన్ : 0891 - 2538689
e-mail : srisanthiashramvsp@gmail.com

**3. విశ్వశాంతి క్షేత్రం**
కైలాసగిరి, విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ**
పీస్ సెంటర్, డార్‌మోనా రోడ్,
కోటగిరి - 643217, నిలగిరి జిల్లా.
తమిళనాడు.
ఫోన్ : 04266-271945
e-mail : vsvmsktg@yahoo.com
vsvmsktg@gmail.com

**5. కాకినాడ శాఖ**
శాంతి ఆశ్రమము, అశోక్ నగర్
కాకినాడ - 533 004.
తూ.గో.జిల్లా

**6. పిఠాపురం శాఖ**
స్టువర్టు పేట,
పిఠాపురం-533 450. తూ.గో.జిల్లా.

**Website : www.srisantiashram.org**

# కార్యక్రమములు - మాతృ ఆశ్రమం

**తేది 9-12-2021 (గురువారం)** సుబ్రహ్మణ్య షష్ఠి

**తేది 14-12-2021 (మంగళవారం)** గీతాజయంతి సందర్భంగా ఉ॥7.30 గం॥లకు శ్రీకృష్ణ అష్టోత్తర శతనామార్చన (గోశాల కృష్ణ మందిరము)&తపోవన మహరాజ్ జయంతి

**తేది 16-12-2021 (గురువారం)** హనుమద్వ్రతం సందర్భంగా శ్రీ హనుమంత అష్టోత్తర శతనామార్చన

**తేది 18-12-2021 (శనివారం)** దత్తజయంతి సందర్భంగా శతనామార్చన

**తేది 22-12-2021 (బుధవారం)** శ్రీమాతా శారదాదేవి జయంతి

**తేది 25-12-2021 (శనివారం)** క్రిస్మస్

**తేది 30-12-2021 (గురువారం)** భగవాన్ శ్రీ రమణ మహర్షి జయంతి

ఈ కార్యక్రమములు శ్రీ గణేష్ ఆచార్య, శ్రీ గంగరాజు మాష్టారు గారిచే నిర్వహించబడును.

# శాశ్వత అన్నదానం

1. శ్రీ గరికిపాటి వారి కుటుంబ సభ్యులు 5000/-
కీ॥శే॥ జి. లక్ష్మణ్ గారి జ్ఞాపకార్థం
2. శ్రీమతి & శ్రీ చుక్కల సత్యనారాయణ మూర్తి గారు (ధర్మవరం) 5000/-
వీరి మనుమరాలు చి॥ సాయి శరణ్య పుట్టినరోజు సందర్భముగా
3. శ్రీమతి డి.ఎస్. లలిత కుమారి గారు (శాంతి ఆశ్రమం) 5000/-
వీరి భర్త గారు శ్రీ దగ్గుబాటి సుబ్బారావు గారి జ్ఞాపకార్థం
4. శ్రీమతి బుద్ధరాజు సత్యనారాయణమ్మ గారు 15000/-
వైఫ్ ఆఫ్ శ్రీ బి. సూర్యనారాయణ రాజు గారు (రాచపల్లి)
వీరి పుట్టినరోజు సందర్భంగా మరియు వీరి తల్లి గారు
శ్రీమతి దాట్ల సత్యనారాయణమ్మ వీరి పినతల్లి
శ్రీమతి దాట్ల సన్యాసమ్మ గార్ల జ్ఞాపకార్థం
5. శ్రీ కె. రామారావు పట్నాయక్ గారు (మదురవాడ) 5001/-
వీరి గురువు గారు శ్రీ స్వామి జ్ఞానానంద వారి జ్ఞాపకార్థం
6. శ్రీ కందుకూరి వెంకట సీతారామయ్య గారు 5000/-
శ్రీ కందుకూరి వెంకట రమణ గారి జ్ఞాపకార్థం
7. శ్రీమతి చందూరి వెంకటలక్ష్మి గారు (విశాఖపట్నం) 10,000/-
వీరి భర్త గారు సాయి వెంకట రామకృష్ణ గారి జ్ఞాపకార్థం
8. శ్రీ వింటి సత్యనారాయణ గారు (కాకినాడ) 5000/-
కీ॥శే॥ వింటి ఈశ్వర వెంకట కనక దుర్గ సత్యప్రసాద్ గారి జ్ఞాసకార్థం
9. శ్రీ సానిపిని వీర్రాజు & శ్రీమతి వీరాయమ్మ గారు (వేట్లపాలెం) 5000/-
వీరి అత్తగారు మాసిన చిట్టి వీరాయమ్మ గారి జ్ఞాపకార్థం
10. శ్రీ దాట్ల ఉత్తమ శ్రీ కృష్ణ గారు, శ్రీమతి పూజగారు 100000/-
(హైదరాబాద్)
వీరి పెండ్లి రోజు సందర్భముగా
11. శ్రీ ఎమ్. వెంకట్రావు గారు (విశాఖపట్నం) 10000/-
వీరి అక్కయ్య గారు కీ॥శే॥ ఈరంకి సర్వాచ్చుతమ్ గారి జ్ఞాపకార్థం

## విరాళములు

| | | |
|---|---|---|
| 1. | డా॥ గరికిపాటి హేమ గారు (విశాఖపట్నం) | 8000/- |
| 2. | శ్రీ ఎల్.వి. శ్రీ కిరణ్ గారు (విశాఖపట్నం) | 10000/- |
| 3. | శ్రీ గరికిపాటి వెంకట్ గారు, శ్రీ జి.ఎస్. శర్మ గారు<br>శ్రీమతి జి. పద్మగారు (కాకినాడ)<br>గోగ్రాసం నిమిత్తం | 6000/- |
| 4. | బ్రహ్మ కుమారి అనంతలక్ష్మి సత్యవతి గారు (శాంతి ఆశ్రమం)<br>గోగ్రాసం నిమిత్తం | 5000/- |
| 5. | దేవి సీ ఫుడ్స్ లిమిటెడ్ (పెద్దాపురం)<br>గోగ్రాసం నిమిత్తం | 100000/- |
| 6. | శ్రీమతి భువనేశ్వరి గారు (చెన్నై) | 1000/- |
| 7. | శ్రీమతి రేణుక అశోక్ కుమార్ గారు (చెన్నై)<br>విద్యా ఖర్చుల నిమిత్తం | 19000/- |
| 8. | డా॥ బి. కృష్ణ రాం గారు (న్యూఢిల్లీ)<br>సోలార్ సిస్టం నిమిత్తం | 5080/- |
| 9. | శ్రీ గొల్లపూడి నాగేశ్వరరావు గారు (శాంతి ఆశ్రమం) | 1000/- |
| 10. | శ్రీ కుసుమంచి రామేశ్వరరావు గారు (శాంతి ఆశ్రమం)<br>డా॥ ఎన్. గౌతమ్ కుమార్, డా॥ వెంకట శ్రీ సాహితీ గార్ల కుమారుడు<br>చి॥ దృవిత్ ఇషాన్ గారి బారసాల సందర్భముగా అన్నదానం | 5000/- |
| 11. | శ్రీమతి జ్యోతి & శ్రీ కేశవరావు గారు (గుంటపల్లి)<br>అన్నదానం - వస్త్రదానం | 11111/- |
| 12. | శ్రీ పి. హరికుమార్ శర్మ గారు (సికింద్రాబాద్) | 1000/- |
| 13. | శ్రీమతి కుంచె సుబ్బలక్ష్మి గారు, శ్రీమతి నడింపల్లి లక్ష్మి గారు<br>డా॥ బందెల సూర్యనారాయణ గారి జ్ఞాపకార్థం అన్నదానం | 15000/- |
| 14. | శ్రీ వెన్నా సత్య అర్జున ప్రభాకరరావు గారు,<br>శ్రీ తుమ్మల స్వర్ణ సురేష్ గారు గో సంరక్షణ నిమిత్తం | 3000/- |
| 15. | శ్రీ గొల్లపూడి సాయినాధ రావు గారు (గొల్లప్రోలు)<br>అన్నదానం నిమిత్తం | 1000/- |

16. శ్రీమతి కముజు అనంతలక్ష్మి గారు (శాంతి ఆశ్రమం) 1011/-
వీరి పిల్లలు వెంకట కరుణాకర్, సుభాషిణి, నిహారిక, శ్రీనివాస్, లక్ష్మీ ప్రసన్న, ఫణీంద్ర వీరి ఆరోగ్యం కోరుతూ...

17. శ్రీమతి దూళిపూడి దుర్గమ్మ గారు (శాంతి ఆశ్రమం) 5000/-
వీరి అత్తగారు డి. బాలమ్మ గారి జ్ఞాపకార్థం అన్నదానం

18. శ్రీ నల్లం సత్యనారాయణ గారు (కాకినాడ) 1000/-
వీరి అల్లుడు గారు
శ్రీ కొంతం శ్రీనివాసు గారి పుట్టినరోజు సందర్భముగా
గోగ్రాసం నిమిత్తం

## విన్నపము

దివ్యాత్మ స్వరూపులు, ఆశ్రమ భక్తులు, ఆశ్రమ శ్రేయోభిలాషులు, దాతలకు ప్రణామములు.

మీరు సహృదయముతో ఆశ్రమానికి యిచ్చే విరాళములు 3,000/- రూ॥ ఆపైన యిచ్చే విరాళములు మాత్రమే శాంతి పత్రికలో ముద్రించబడతాయని తెలియపరచుకొనుచున్నాము.

**ఇట్లు**

**ఆశ్రమ యాజమాన్యం**

మనస్సు తానున్న ప్రదేశములో స్వర్గమును నరకముగను, నరకమును స్వర్గముగను మార్చగలదు. కావున స్వర్గనరకముల సృష్టికర్తలము మనమే! మనకు సంభవించిన ప్రతివిషయము మన మంచికేనని భావించాలి. ప్రేమ, దయ, కనికరములకు ఆలవాలమై యున్న భగవంతుని శక్తిచే ప్రతీది నిర్ణయింపబడును. విషయాలను తప్పుగా భావించి మనం దుఃఖపూరితుల మగుచున్నాము. బాహ్య జీవితములో మనం నిరంతరం భగవంతుని స్ఫురణ యందుంచుకొనుట వలన మనకు సమ్యక్ దృష్టి కలుగును.

**స్వామి రామదాసు**

This Periodical is Registered with Registrar of Newspapers, New Delhi Vide R.No. 3447/57,
Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2021-2023

# SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

1. Auto Biography of Swami Omkar (2 Volumes) .......... Rs. 150/-
2. Life and Teachings of Swami Omkar .......................... Rs. 10/-
3. Soham .......................................................... Rs. 10/-
4. Cosmic Fast ..................................................... Rs. 20/-
5. Meditation ....................................................... Rs.10/-
6. Om Japa .......................................................... Rs.10/-
7. Control of Mind ................................................ Rs.30/-
8. Cosmic Flashes ................................................ Rs.10/-
9. In the Hours of Silence ..................................... Rs.10/-
10. The Soul of Omkar ........................................... Rs.10/-
11. How I learned English ...................................... Rs.10/-
12. Reincarnation of my Little Sister ........................ Rs.10/-
13. God Realization Now and Here ........................... Rs.10/-
14. Mystic Prayers and Poems ................................. Rs.20/-
15. The Divine Voice of Omkar ................................ Rs.40/-
16. Auto Biography of Omkar (Revised Edition) ........... Rs.100/-
17. Petals of Peace ............................................... Rs.20/-
18. The Story of my life and Work ........................... Rs.10/-
19. Priceless legacy of Swami Omkar ........................ Rs.10/-
20. The Four Initiations ......................................... Rs.10/-
21. Musings ......................................................... Rs.20/-
22. Peace Prayer .................................................. Rs.20/-

THE MISSION OF PEACE
శ్రీ శాంతి ఆశ్రమము
పోస్టు : శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446.
తూ॥గో॥జిల్లా., (ఆ.ప్ర.)
ఫోన్ : 7382009962
email:srisanthiashram@gmail.com
www :www.srisantiashram.org.in

Printed Book

To

Printed by Padmanabha Offset Printers and Published by Swamini Vinamrananda on behalf of The Mission of Peace Sri Santi Ashram and Printed at Padmanabha Off-set Printers, Kakinada - 533 004 Cell : 93979 50719 and Published at Thotapalli Hills 533 446 Ph : 7382009962 Editor : Swamini Vinamrananda.